క్లుప్తంగా

కరుణించు వరుణదేవా..



ధన్వాడ: మండలంలోని కొండాపూర్ గ్రామంలో మంగళవారం వర్షం కురవవాలని మహిళలు వరుణ దేవుడిని వేడుకున్నారు. కప్పతో గ్రామంలో ర్యాలీగా గజలమ్మ ఆలయం వరకు వెళ్లి అక్కడ అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం పాయసంతో నైవేద్యం సమర్పించి భక్తులకు పంచి పెట్టారు. ఇలా చేస్తే ఆశించిన స్థాయిలో వర్షం పడుతుందని మహిళలు తెలిపారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మరికల్: బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు అరుణకుమార్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులకు సంబంధించిన పీఎఫ్ ఖాతాకు సంబంధించిన వాటిలో తప్పులు వచ్చాయన్నారు. ఖాతాదారుల వద్ద ఉన్న డాక్యుమెంట్లను పరిశీలించి వాటిని సరి చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే వారికి డబుల్‌బెడ్రూం ఇళ్లు, మూడు ఎకరాల భూమితో పాటు 50 ఏళ్లు నిండిన కార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హేమలత, సంజీవ, చెన్నమ్మ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దామరగిద్ద: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఎంపీపీ నర్సప్ప అధ్యక్షతన బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ సమావేశపు గదిలో ప్రారంభించనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషి



నారాయణపేట టౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మేరా బూత్ సబ్ సే ముజ్బూత్ కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నాయకులు టీవీలో వీక్షించారు. కార్యక్రమం వీక్షించిన అనంతరం రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, కె.రతంగ్‌పాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రధాని ప్రసంగం స్ఫూర్తితో కార్యకర్తలు ప్రతి బూత్‌లో పార్టీ పటిష్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ప్రభాకర్‌వర్ధన్, సత్యయాదవ్, నందునామాజీ, రఘురామయ్యగౌడ్, రఘువీర్, రఘుపాల్, మల్లేష్, గోపాల్ యాదవ్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలు విజయవంతం చేయండి

మక్తల్: రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను విజయవంతం చేయాలని నారాయణపేట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం పట్టణంలో వివిధ కళాశాలలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్విజ్ పోటీల్లో 16 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వరకు యువత పాల్గొనవచ్చన్నారు. మక్తల్ నియోజకవర్గం నుంచి మొదటి స్థానంలో నిలిచిన మహిళలు స్కూటీ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నర్సిములు, గణేష్, రవికుమార్, దామోదర్‌రెడ్డి, మల్లేష్, ఫయాజ్, అంజప్ప, రాజేందర్, పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి చట్టం చేయాలి

దామరగిద్ద: ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం తీసుకురావాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు తాయప్ప అన్నారు. వ్యవసాయ కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అజీజ్, ముజ్జాయిద్దీన్, వెంకటప్ప, రాములు, హుస్సేన్, బస్సమ్మ, పద్మమ్మ, శశికళ, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడి

కోస్గి: విత్తనశుద్ధితో అధిక దిగుబడి సాధించవచ్చని ఏఈఓ తిరుపతి సూచించారు. మంగళవారం ముంగిమళ్లలో విత్తన శుద్ధి చేసుకునే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఓ రైతు పొలంలో కంది విత్తనాలను భాస్వరాన్ని కరిగించే పీఎస్‌బీ బ్యాక్టీరియాతో విత్తన శుద్ధి చేయించారు. సేంద్రీయ ఎరువులు వేసుకోవడం ద్వారా భూములు సారవంతమై నాణ్యవంతమైన అదనపు పంట దిగుబడి వస్తుందన్నారు. రైతులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలతో జ్ఞాపకశక్తి



దామరగిద్దలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

నారాయణపేట రూరల్: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మండల కేంద్రాల్లో క్విజ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. దాదాపు వంద పాఠశాలల నుంచి 132 జట్లు పాల్గొనగా వారిలో ప్రతి మండలం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ఎంపిక చేశారు. వీరిలో మొదటి స్థానంలో నిలిచిన తొమ్మిది జట్లు జులై 4న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. అక్కడ చక్కటి ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.5వేలు, ద్వితీయ స్థానం వారికి రూ.4వేలు, తృతీయ స్థానం జట్టుకు రూ.3వేలు నగదు పురస్కారం అందిస్తామని ఎల్‌డీఎం విజయ్‌కుమార్ తెలిపారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆర్‌బీఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కస్తూర్బా గాంధీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి తులసి, తారిష మొదటి బహుమతులను గెలుపొందారు. వారికి ధన్వాడ యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్ తదితరుల ఉన్నారు.

దామరగిద్ద: విద్యార్థులు తమ ప్రతిభతో జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో రాణించాలని ఎస్‌బీఐ మేనేజర్ గోపాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆర్‌బీఐ సౌజన్యంతో మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం బాలాజీ, హెచ్‌ఎం జ్యోతి, పీఈటీ వెంకటప్ప విద్యార్థులు పాల్గొన్నారు.



కోస్గిలో..

ఊట్కూరు: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో భారతీయ రిజర్వ్ బ్యాంకు సహకారంతో హెచ్‌బీఐ ఆధ్వర్యంలో మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని 9 పాఠశాలల నుంచి 18 మంది విద్యార్థులు క్విజ్ పోటీలో పాల్గొన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.5 వేలు, ద్వితీయ రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సురేష్‌కుమార్, హెచ్‌ఎం స్పందన, సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు నర్సింహ, ఆనంద్, నాగలక్ష్మీ, నరేష్, రాములు, వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల స్థాయి ఆర్థిక అక్షరాస్యత క్విజ్ పోటీల్లో మొదటి విజేతగా మాగనూర్ పాఠశాలకు చెందిన లక్ష్మీనారాయణ, నాగేష్, ద్వితీయ స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ వడ్వాట్ నందిని, అనురాధ, తృతీయ బహుమతి కున్సి జెడ్పీహెచ్‌ఎస్ బాబు, సంతోషలు నిలిచారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సుమన్, ఎంఈఓ వెంకటయ్య, రాజేశ్వర్, నర్సిములు, రామ్మోహన్, సీఆర్పీలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండల పరిధిలోని 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బోగారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం, గుండుమాల్ మోడల్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం, మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. నోడల్ అధికారి వెంకట్రాముడు, బ్యాంకు మేనేజర్ రాజరాం కిషోర్, సీఆర్పీ దస్తయ్య, ఇన్విజిలేటర్‌గా నర్సిములు, అనంతప్పతోపాటు పలువురు పాల్గొన్నారు.

మద్దూరు: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి 'ఆర్థిక అక్షరాస్యత' పోటీలు నిర్వహించారు. మండలంలోని 14 ఉన్నత పాఠశాలల విద్యార్థులు 16 జట్లుగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో రెనివట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి గెలుపొందారు. వీరికి ఎంఈఓ గోపాల్‌నాయక్, ఎస్‌బీఐ మద్దూరు బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

'చేనేత బంధు' అమలు చేయాలని ర్యాలీ



పేటలో ర్యాలీ చేస్తున్న చేనేత కార్మికులు

నారాయణపేట రూరల్: నేత కార్మికులకు చేనేత బంధు పథకాన్ని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామారెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకుడు బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని బారంబావి నుంచి మున్సిపల్ పార్క్ వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. దళితబంధుతో పాటు బీసీ కుల వృత్తుల వారికి అందిస్తున్న రూ.లక్ష సాయాన్ని సైతం నేతన్నలకు అందించాలని డిమాండ్ చేశారు. పేదరికంతో నెట్టుకొస్తున్న నేత కార్మికుల జీవితాలను బాగుచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. చేనేత కార్మికులకు కాటన్‌మిల్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబు, సీలేష్, కృష్ణ, లక్ష్మీనారాయణ, సాగర్, నరేష్, ఇస్మాయిల్, బాలకృష్ణ, బాలు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' నిర్వీర్యం చేసేందుకు కుట్ర



మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు గిట్టుబాటు అయ్యే విధంగా కూలి రేట్లు పెంచాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చట్టాన్ని ఉపసంహరించు కోవాలని, మెజర్మెంట్ రేట్లు పెంచి మూడు రోజులకు రూ.600 కూలీ వచ్చేటట్టు మార్పు చేయాలన్నారు. పెండింగ్ వేతనాలు అందించి, మేటీలకు పారితోషికం ఇవ్వాలని కోరారు. ఇన్సూరెన్స్, సేఫ్టీ కిట్, పనిముట్లు, కనీస సౌకర్యాలపై దృష్టి సారించాలన్నారు. గతంలో 82 రకాల పనులు చేయిస్తుండగా వాటిని కుదించి 22 రకాల పనులు మాత్రమే అనుమతులు ఇస్తున్నారని వాపోయారు. వ్యవసాయ కూలీల పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఉపాధి హామి కూలీల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకట్రాములు, నారాయణ, బాలు, సలీం, అంజి, కిష్టన్న, నర్సింహులు, రాము, వెంకట్, సాయికుమార్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఎన్నిక



అభివాదం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

నారాయణపేట రూరల్: నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున సంఘం సభ్యులు తరలివచ్చారు. నూతన అధ్యక్షుడిగా అశోక్‌కుమార్ (నారాయణపేట), ప్రధాన కార్యదర్శులుగా గోపాల్ (మరికల్), రాము (యాంకి, నర్వ), గౌరవ అధ్యక్షులుగా నర్సింహులు, దశరథ్ (నారాయణపేట), హన్మంతు (మక్తల్), ఉపాధ్యక్షులుగా నర్సింహులు (జక్లేర్), చంద్రశేఖర్ (మరికల్), నారాయణ (దామరగిద్ద), వేణుగోపాల్ (ధన్వాడ), సహ కార్యదర్శులుగా రవికుమార్ (సింగారం), వెంకటేష్ (పెద్దపొర్ల), మల్లేష్ (మాగనూర్), తారా కృష్ణ (ఊట్కూర్), సంయుక్త కార్యదర్శులుగా రవి (మక్తల్), లక్ష్మయ్య (ధన్వాడ), కృష్ణయ్య (దామరగిద్ద), భాస్కర్ (పేరపళ్ళ), కోశాధికారిగా భీమశంకర్ (నారాయణపేట), సలహాదారులుగా తిరుపతయ్య (కోటకొండ), సదానంద్ (నారాయణపేట), నర్సింహులు (ధన్వాడ)లు ఉన్నారు. వీరిని శాలువాతో సత్కరించి అభినందించారు. నాయీ బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని, ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో తమ సమస్యలను పరిష్కరించే వారికే మద్దతు తెలిపేందుకు సమష్టిగా ముందుకు పోదామన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుదామని పిలుపునిచ్చారు.

రక్తదాన శిబిరం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న సిబ్బంది

నారాయణపేట రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతం అయ్యిందని నిర్వాహకులు తెలిపారు. రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఏడాదిలో రెండుసార్లు రక్తదానం చేయాలని, రక్తం శుద్ధి జరుగుతుందన్నారు. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రక్తం ఇవ్వడం వల్ల ఎలాంటి దుష్పరిణామాలు ఉండవని, అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. రక్తదానం వల్ల ఎంతో మంది ప్రమాద బాధితులు, గర్భిణులకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందించారు. డీఎం ఆంజనేయులు, ఎస్‌టీఐ నజీర్‌షేక్, సూపరింటెండెంట్ నరేందర్, రెడ్‌క్రాస్ సభ్యులు ఆత్మారాం, ఆర్టీసీ సిబ్బంది డీఎస్ నారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

కోస్గి: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్టీసీ అధికారులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జిల్లా ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో శిబిరం నిర్వహించి దాతల నుంచి రక్తం యూనిట్లు సేకరించారు. ఇందులో ఆర్టీసీ అధికారులు కేవీ రెడ్డి, వెంకటేష్, డాక్టర్ పూర్ణచందర్ యాదవ్, వెన్న శేఖర్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

మరికల్: మండలంలోని జిన్నారం గ్రామానికి చెందిన సాయిరెడ్డికి చెందిన స్మార్ట్ ఫోన్ రెండు నెలల క్రితం పోగొట్టుకున్నాడు. ఈ విషయంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా దొరికిన ఫోన్‌ను మంగళవారం ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి బాధితుడికి అందజేశారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, సీఈఐఆర్ ద్వారా గుర్తించి బాధితులకు అందజేస్తామన్నారు.

హరితహారంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మద్దూరు: హరితహారంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శశికళ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో హరితహారం, చెత్త సేకరణ, ఎరువుల తయారీ తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. హరితహారం కార్యక్రమంపై దిశా నిర్దేశం చేశారు. లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలన్నారు. నారాయణపేట, కోస్గి రోడ్డులో ఎవెన్యూ ప్లాంటేషన్ 8 కిలోమీటర్ల మేర పెద్ద ఫారెస్ట్ నర్సరీల నుంచి మొక్కలు తీసుకొచ్చి నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉదయ్‌శంకర్, ఏపీఓ నాగరాజు, ఈసీ జేపీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. జ

రామసముద్రంలో కొండ చిలువ

మక్తల్: మండలం రామసముద్రంలో బసవరాజు ఇంటి దగ్గర మంగళవారం కొండ చిలువ కనిపించింది. భయాందోళనతో చుట్టు పక్కల వారు కర్రలతో దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందింది.

మల్టీపర్పస్ విధానం రద్దుకు డిమాండ్



మాట్లాడుతున్న నర్సింహులు

నారాయణపేట రూరల్: జీపీ కార్మికుల సమస్యల సమస్యల పరిష్కారం కోసం జులై 6 నుంచి సమ్మె చేపడుతున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎదిరింటి నర్సింహులు అన్నారు. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశల వారి పోరాటంలో భాగంగా మంగళవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ 60 ప్రకారం కార్మికుల వేతనాలు పెంచాలని, జీఓ 51ని వెనక్కి తీసుకుని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, జీపీ ట్రాక్టర్లకు డ్రైవర్లను నియమించాలన్నారు. కార్మికుల ప్రాణత్యాగంతో సాధించుకున్న 29 రకాల చట్టాలను నిర్వీర్యం చేసి కట్టుబానిసలా పనులు చేయిస్తుందని దుయ్యబట్టారు. వెంటనే జీపీ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జూలై 6 నుంచి నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, నర్సింహులు, రవి, గోపాల్, రాజు, సాయికుమార్, శ్రీను, నారాయణ, సిద్దేనాయక్, మురళి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

మక్తల్: గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ తిరుపతయ్యకు, సీఐ సీతయ్య, ఎస్‌ఐ పర్వతాలకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. చెక్ పోస్టుల దగ్గర నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. సత్యనారాయణగౌడ్, వాకిటి శ్రీహరి, డాక్టర్‌ఆశప్ప, భీమేస్, శ్రీనివాస్ మూర్తి, రామాంజనేయులు, నాగరాజు, అక్షయ్ పాల్గొన్నారు.

మాగనూర్: గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్‌గ్దల్ నాయకులు మండలశారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్, మాగనూర్ ఎస్‌ఐ మల్లేష్‌లకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కే. సత్యనారాయణగౌడ్, వాకిటి భీమన్న, మనీవర్ధన్ ఉన్నారు.

కౌశిక్‌రెడ్డిని బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయాలి

నారాయణపేట టౌన్: ముదిరాజ్ సమాజాన్ని కించపరిచిన పాడి కౌశిక్‌రెడ్డిని తక్షణమే బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ముదిరాజ్ సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ నారాయణకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు కాకర్ల భీమయ్య, సింగిల్ విండో డైరెక్టర్ మల్లేష్ మాట్లాడుతూ ముదిరాజ్ సమాజాన్ని అవమాన పరిచిన పాడి కౌశిక్ రెడ్డికి రాజకీయ సమాధి చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో 50 లక్షల మందికి పైగా ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసిన దొరలకు గుణపాఠం తప్పదన్నారు. బీసీలపై ఎందుకింత వివక్ష చూపుతున్నారని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృత్తం అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేయాల్సి వస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో బొమ్మన్‌పాడ్ సర్పంచ్ శ్రీనివాస్, భగవంత్, నర్సింహులు, మాజీ ఎంపీటీసీ గుండప్ప, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ కాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


మక్తల్: మండలంలోని పంచదేవ్‌పాడు గ్రామ సమీపంలో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం మక్తల్ పోలీసులు పట్టుకున్నారు. పస్పుల గ్రామం వాగు నుంచి పంచదేవ్‌పాడు గ్రామ వరకు ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తున్నారు. అందుకున్న సమాచారం మేరకు తనిఖీ చేయగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

ఊట్కూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామసమీపంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక టాక్టర్‌ను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. అదేగ్రామానికి చెందిన జనార్దన్‌రెడ్డి ఇసుక టాక్టర్ అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా మైనింగ్ అధికారుల ఆదేశాల మేరకు పోలీసులు పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

కర్ణాటక డీజిల్ ట్యాంకర్..

కృష్ణా: మండలంలోని నల్లగట్టు శివారులో గల స్టోన్ క్రషర్లకు కర్ణాటకకు చెందిన కొందరు ట్యాంకర్ల ద్వారా డీజిల్‌ను తరలిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి అక్రమంగా కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణలోకి 4 వేల లీటర్ల డీజిల్ ట్యాంకర్ ప్రవేశించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు తనిఖీ నిర్వహించగా డీజిల్ ట్యాంకర్ పట్టుబడింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కాశప్ప తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



యూనిఫాం పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

కోస్గి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం గుండుమాల్ మండలంలోని బోగారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం మండల స్థాయిలో ఆర్‌బీఐ ఆదేశాల మేరకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన పాఠశాల విద్యార్థులను సన్మానించారు. ఇందులో పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు చదువులో చక్కగ రాణించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని అడవిసత్యారంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రామకృష్ణ ప్రాథమిక పాఠశాల అడవిసత్యారం పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సమకూర్చిన పాఠ్యపుస్తకాలు ఆయన అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సిములు, ఆనంద్‌గౌడ్, రవికుమార్, కోల్పూర్ రాములు, హన్మంతు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య సాధ్యమని ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటయ్య అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ సంవత్సరం 120 మంది విద్యార్థులు పాఠశాలలో చేరడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆయన అభినందించారు.

అంబాభవానీ మాతను దర్శించుకున్న ఎమ్మెల్యేలు



మక్తల్: మహారాష్ట్రలోని అంబాభవానీ మాతను మంగళవారం మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పల్లె పల్లెకు వీజేఆర్

మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో సర్పంచ్ తిమ్మప్ప, మాజీ సర్పంచ్ అంజప్ప గౌడ్‌ల ఆహ్వానం మేరకు పల్లె పల్లెకు వీజేఆర్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో గ్రామంలోని ప్రధానమైన సమస్యలను వీజేఆర్ అధినేత వర్కటం జగనాథ్‌రెడ్డి అడిగి వివరాలు సేకరించారు. గ్రామంలో ప్రధానంగా తాగునీటి సమస్య ఉందని గ్రామస్తులు తెలుపడంతో మూడు రోజులో గ్రామంలో నూతన బోరు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కృష్ణా: గోహత్య నిషేధిత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ మంగళవారం విశ్వ హిందు పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ వైపీ రమేష్, ఎస్‌ఐ విజయభాస్కర్‌లకు వేర్వేరుగా వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా గోవులను వధశాలలకు తరలించకుండగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో నాయకులు సత్యనారాయణగౌడ్, శంకర్, భీమన్న, ఆశప్ప, మనివర్ధన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్ల జానమ్మ దేవాలయంలో చోరీ

మక్తల్: అంతర్రాష్ట్ర రహదారి సమీపంలో ఉన్న నల్లజానమ్మ దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ పర్వతాలు వివరాల ప్రకారం ఉదయం గుర్తుతెలియని భక్తుడు అమ్మవారి ఆలయానికి వచ్చాడు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించాడు. అదే సమయంలో ఆలయ పూజారి మల మూత్ర విసర్జన కోసం బయటకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించి అమ్మవారి మెడలో ఉన్న రెండు తులాల బంగారం నానుతో భక్తుడు ఉడాయించాడు. పూజారి వచ్చేసరికి బంగారు నాను కనబడకపోవడంతో ఆలయ కమిటీ సభ్యులకు తెలిపాడు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుకుల ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాలి



పనులు పరిశీలిస్తున్న ఏఈ దేవేంద్రనాయుడు

మాగనూర్: ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైందని రైతులు, విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు వహించాలని మాగనూర్ విద్యుత్ ఏఈ దేవేంద్రనాయుడు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పలు ప్రదేశాలలో సమస్యాత్మకంగా ఉన్న విద్యుత్ వైర్లను సిబ్బందితో మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరూ సరైన అవగాహన లేక సొంతంగా మరమ్మతు చేసుకోవడం, విద్యుత్ స్తంభాలు ఎక్కడం చేయొద్దన్నారు. సమస్య తలెత్తితే సంబంధిత విద్యుత్ అధికారులను సంప్రదించాలని సూచించారు.